క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షష్టి పూజలు


సుబ్రహ్మణ్యస్వామి

మద్దికెర : మండల కేంద్రంలోని ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి గురువారం షష్టిని పురస్కరించుకొని విశేషపూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలు, మహామంగళహారతి, హోమాలు తదితర పూజలు నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

సబ్‌కోర్టు ఏర్పాటు చేయండి


మంత్రి ఫరూఖ్‌కు వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండలో సబ్ కోర్టు ఏర్పాటు చేయాలని న్యాయవాదులు కోరారు. ఈ మేరకు గురువారం పత్తికొండ నుంచి నంద్యాలకు వెళ్లిన న్యాయవాదులు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సబ్ కోర్టు లేక ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని న్యాయవాదులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, న్యాయవాదులు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


నంచర్లలో ఓవర్ హెడ్ ట్యాంకును శభ్రం చేస్తున్న దృశ్యం

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్రధాన వీధులు ,బీసీ, ఎస్సీ, కాలనీల్లో మురుగు కాలువల్లో పేరుకు పోయిన చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అలాగే గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శి సురేంద్ర ఉన్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం


ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ(తుగ్గలి) : మండలంలోని పుచ్చకాయలమాడ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.60.5లక్షలతో నూతనంగా నిర్మించనున్న ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి గురువారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. లిఫ్ట్ తీసుకొచ్చి పుచ్చకాయలమాడతో పాటు పక్కనున్న గ్రామాల పొలాలకు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీళ్లివ్వాలని సీఎం సంకల్పించారన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ స్వర్ణలత, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహబూబ్‌ఖాన్, టీడీపీ నాయకులు శ్రీధరరెడ్డి, వెంకటపతి, లోకనాథ్ పాల్గొన్నారు.

సీవీ రామన్ జయంతి


రామన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఆస్పరి: స్థానిక నారాయణ ప్రైమ్ ప్రవేట్ స్కూల్లో శాస్త్రవేత్త సీవీ రామన్ జయంతిని గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్ఎం నరేష్ ఆచారి మాట్లాడుతూ సీవీ రామన్ దేశానికి చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త శుద్ధి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కంపోస్టు ఎరువును పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

పత్తికొండ(తుగ్గలి) : చెత్తశుద్ధి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ స్వర్ణలత అన్నారు. గురువారం మండలంలోని దూదేకొండ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టరు, రికార్డులను పరిశీలించారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం చెత్త శుద్ధి కేంద్రాన్ని సందర్శించి కంపోస్టు ఎరువును పరిశీలించారు. పల్లెల్లో చెత్త సేకరించి శుద్ధి కేంద్రాలకు తరలించి కంపోస్టు ఎరువులు తయారుచేసేలా చూడాలన్నారు. కంపోస్టు ఎరువులు అమ్మడం ద్వారా ఆదాయం సమకూరుతుందన్నారు. సర్పంచ్ రెహమాన్, పంచాయతీ కార్యదర్శి సాలేహా బొఖారియా, ఏపీఓ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నీళ్లివ్వండి సారూ!

సర్కారు బడుల్లో సకల వసతులు కల్పించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ముఖ్యంగా విద్యార్థులకు శుద్ధజలం అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసింది. అయితే నీటి యంత్రాలు చిన్నపాటి మరమ్మతులకు గురైనా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చిన్నారులు నీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటినుంచి తెచ్చుకున్న వాటర్ బాటిళ్లలో నీరు అయిపోవడంతో ఇక మధ్యాహ్న భోజన సమయంలో గొంతు పడి ప్లేట్లు కడుక్కునే కుళాయిల నీరు తాగుతున్నారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీరూ కరువే
- మూలనపడిన మినరల్ వాటర్ ప్లాంట్లు
- కనీసం మరమ్మతులకూ నోచుకోని వైనం
- మధ్యాహ్న భోజన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- అయినా కనికరించని ఉన్నతాధికారులు
- స్థానికంగా పట్టించుకోని హెచ్‌ఎంలు, ఎంఈఓలు



నంచర్లలో వినియోగంలో లేని మినరల్ వాటర్ ప్లాంట్ , ఏరూరులో నీళ్లు లేకుండా మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

చిప్పగిరి: వైస్సార్‌సీపీ పాలనలో విద్య ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా రూపొందించారు. నాడు– నేడు కార్యక్రమం ద్వారా పాఠశాల లో తొమ్మిది రకాల మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు శుద్ధ జలం అందించడానికి మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రతి ప్రభుత్వ పాఠశాల్లో 11 మినరల్ వాటర్ ప్లాంట్లు నెలకొల్పి అభ్యాసకులకు స్వచ్ఛమైన నీరు అందజేసింది. ప్రభుత్వం మారడం, నిర్వహణ లోపించడంతో పాఠశాలల్లో వసతులు ఒక్కొక్కటిగా దూరమవుతున్నాయి. కొన్ని నెలలుగా వాటర్ ప్లాంట్లు మరమ్మతులకు గురైనా బాగు చేయించేవారు లేరు. దీంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే ఇంటి నుంచి బాటిళ్లతో నీటిని తెచ్చుకుంటున్నారు. ఆ నీరు మధ్యాహ్నం పాటికి అయిపోతుండటంతో ఆ తరువాత వారికి గొంతు తడుపుకునేందుకు నీరుండదు. ఇక మధ్యాహ్న భోజన సమయంలో గొంతు పడి నీటి కోసం అల్లాడుతున్నారు. చివరకు బోరు, ప్లేట్లు శుభ్రం చేసుకునే కుళాయిల నీటి తాగుతున్నారు. ఆ నీరు తాగితే రోగాల బారిన పడతామని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో తాగిల్సి వస్తుందని చిన్నారులు చెబుతున్నారు. హెచ్‌ఎంలు, ఎంఈఓలు నివేదికలు పంపి చేతులు దులుపుకుంటుండటం, సమస్య తీవ్రత తెలిసినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మండలంలో..

మండలంలో మొత్తం 26 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో జెడ్పీ హైస్కూల్స్ 5, ప్రాథమికోన్నత పాఠశాలలు 14, ప్రాథమిక పాఠశాలలు 6, ఒక కేజీబీవీ ఉన్నాయి. వీటిలో మొత్తం 3,167 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం పాఠశాలలో నాడు– నేడు ఫేజ్–1 కింద 11 మినరల్ వాటర్ ప్లాంట్లను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాటిలో చిప్పగిరి, నేమకల్లు, బంటఋహాల్ గ్రామాల్లోని ఎంపీపీ పాఠశాలలు, రామదుర్గం ఎంపీయూపీ పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్లు పని చేస్తుండగా ఎంపీయూపీ పాఠశాలలైన బెల్డోణ, కుందనగుర్తి, నంచర్ల, ఎంపీపీయస్ పాఠశాలలైన దేగులహాలు, నేమకల్లు,చిప్పగిరి జెడ్పీ హైస్కూల్‌లో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్లు మరమ్మత్తుకు గురై వినియోగంలో లేవు. మొత్తం 11 మినరల్ ప్లాంట్లలో కేవలం నాలుగు వినియోగంలో ఉండగా, 7 ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. దీంతో ఆయా గ్రామాల్లోని విద్యార్థులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు.


ఏరూరు పాఠశాలలో విరిగిన కుళాయిలు

ఇంటి నుంచి నీటిని తెచ్చుకుంటాం



పాఠశాలలో తాగునీరు అందుబాటులో లేకపోవడంతో ఇంటి నుంచే బాటిళ్లలో నీటిని తెచ్చుకుంటున్నాం. తెచ్చుకున్న నీరు మధ్యలోనే అయిపోవడంతో తాగడానికి నీరు లేక అవస్థలు పడుతున్నాం. పాఠశాలలో ఉన్న కుళాయిలు విరిగిపోయి పనిచేయడం లేదు. అధికారులు స్పందించి నీటి సౌకర్యం కల్పించాలి.
– జగదీష్, 7 వతరగతి ఏరూరు

త్వరలో మరమ్మతులు చేయిస్తాం



మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతుకు గురైన వాటర్ ప్లాంట్లకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. ఆదేశాలు వచ్చిన వెంటనే మరమ్మతులు చేయించి శుద్ధ జలం అందుబాటులోకి తెస్తాం.
– సావిత్రి, ఎంఈఓ

మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి జన్మదిన వేడుకలు


శ్రీదేవికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ తుగ్గలి మండల నాయకులు

తుగ్గలి : పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కర్నూలుకు తరలి వెళ్లి ఆమెకు జన్మదిన శుభాకంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ తుగ్గలి మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్, వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, భాస్కరరెడ్డి, జగన్నాథరెడ్డి, ఆర్.మోహన్‌రెడ్డి, ఎం.మోహన్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, అమరనాథరెడ్డి, రాఘవరెడ్డి, హనుమంత రెడ్డి, వెంకటరాముడు, ఈశ్వరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, విష్ణువర్ధనరెడ్డి, రంగారెడ్డి, రఘు, వెంకటేశ్వర్లు, గిడ్డయ్య, కృష్ణానాయక్, చిరు, రంగడు, గోవర్ధనరెడ్డి ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పత్తికొండ ఎంపీపీ నారాయణదాసు, పార్టీ మండల అధ్యక్షుడు కారం నాగరాజు, నాయకులు జయచంద్రారెడ్డి, నాగరాజు, రవిశేఖరరెడ్డి, రవి, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, నజీర్ శ్రీదేవిని సత్కరించారు.

కృష్ణగిరి: ప్రజా సేవకే తన జీవితం అంకితమని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. ఆమె జన్మదిన వేడుకలను గురువారం కర్నూలులోని స్వగృహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు కర్నూలుకు వచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఆమె కేక్ కట్ చేశారు. కృష్ణగిరి ఎంపీపీ, జెడ్పీటీసీలు డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, కేఈ సుభాషిణి, మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు ఉన్నారు.

తగ్గిన టమాట ధర

పత్తికొండ(తుగ్గలి) : టమాట ధర అమాంతం పడిపోయింది. కొద్ది రోజుల క్రితం వరకు కిలో టమాట ధర రూ.33 పలికింది. గురువారం పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కిలో టమాట గరిష్ట ధర రూ.23, కనిష్టం రూ.13, సరాసరి రూ.16 పలికింది. 521.05 క్వింటాళ్ల టమాట పంట ఉత్పత్తులు యార్డుకు రైతులు తీసుకొచ్చారు.


పత్తికొండ మార్కెట్‌కు వచ్చిన టమాట దిగుబడి

పంటల బీమాపై అవగాహన కల్పించండి


వెల్దుర్తిలో మాట్లాడుతున్న ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్

వెల్దుర్తి(కృష్ణగిరి): రబీలో సాగు చేసే పంటలకు రైతులు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో గురువారం ఏఓ అక్బర్‌బాషా ఆధ్వర్యంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రబీలో సాగు చేసే పప్పుశనగ, జొన్న, వరి, వేరుశనగ, ఉల్లి పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంటల బీమా వర్తిస్తుందన్నారు. టమాట పంటకు వాతావరణ బీమా పథకం వర్తిస్తుందని, వరి పంటకు నమోదుకు డిసెంబర్ 31వరకు గడువు ఉందని మిగిలిన పంటలకు డిసెంబర్ 15తో గడువు ముగుస్తుందని తెలియజేయాలని చెప్పారు. రైతులే ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. ఏఈఓలు పాల్గొన్నారు.

పత్తికొండ(తుగ్గలి) : పంటల బీమాపై రైతులు అవగాహన కలిగి ఉండాలని పత్తికొండ మండల ఏఓ వెంకటరాముడు తెలిపారు. గురువారం హోసూరులో రైతులకు పంటల బీమాపై అవగాహన కల్పించారు. రబీలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పప్పుశనగ ఎకరాకు రూ.420, వరి ఎకరాకు రూ.630, జొన్న ఎకరాకు రూ.297, వేరుశనగ రూ.480, ఉల్లి రూ.1350, టమాట ఎకరాకు రూ.1,500 ప్రీమియం చెల్లించాలన్నారు. పప్పుశనగ, వేరుశనగ, జొన్న, ఉల్లి, టమాటకు డిసెంబర్ 15లోపు, వరి పంటకు 31లోపు ప్రీమియం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో రియాజ్‌బాషా, ఆర్‌ఎస్‌కే సిబ్బంది శివ రమేష్ పాల్గొన్నారు.

104 ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి


ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

కృష్ణగిరి: 104 ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని మండల 104 ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ తమకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడతో కుటుంబాలు గడవటం కష్టంగా మారిందన్నారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్‌ను తిరిగి చెల్లించాలని కోరారు. అలాగే సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాల ప్రభుత్వానికి విన్నవించారు.

విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరసింహులు

ఆలూరు: ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల విద్యార్థినులను విద్యార్థులను లైంగికంగా వేధిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సి.వి.నరసింహులు హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాయుజీవోత్తంరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులను ఎవరైనా వేధిస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అధ్యాపకులు, విద్యార్థులు,కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం

చిప్పగిరి: మండలంలోని దేగులహాలు గ్రామంలో రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు మారయ్య గురువారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీపీ నిధులతో పనులు చేపట్టినట్లు తెలిపారు. నాయకులు లాల్ స్వామి,లింగన్న,రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

తుగ్గలి : రోడ్డు ప్రమాదంలో మద్దికెర మండలం అగ్రహారం గ్రామానికి చెందిన సావిత్రి తీవ్రంగా గాయపడ్డారు. ఆళ్లగడ్డ నుంచి భర్తతో కలిసి గురువారం బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా పగిడిరాయి సమీపంలోని బంగారం మిట్ట వద్ద ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీ కొట్టింది. దీంతో సావిత్రికి కాలు విరిగి తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం గుంతకల్లుకు తరలించారు.

కనకదాసు జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

హొళగుంద: భక్త కనకదాసు జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలని మండల కురువ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మాదాసి కురువ సంఘం ఆలూరు తాలూకా అధ్యక్షుడు పెద్యాట మల్లయ్య, మండలాధ్యక్షుడు పంపన్న, కనకశ్రీ యూత్ నాయకుడు ఎస్కే గిరి తదితరులు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కురువలు పెద్ద సంఖ్యలో ఉన్నారని వారు ఆరాధిస్తున్న భక్త కనకదాసు చరిత్ర గొప్పదన్నారు. ఈ నెల 18వ తేదీన జరిగే కనకదాసు జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలని, అలాగే సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. అలాగే కురువల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. కోగిలతోట శేషప్ప, రవి, ఎల్లార్తి దర్గన్న, శేషన్న, గాదిలింగ ఉన్నారు.

నైపుణ్య గణనను పక్కాగా చేపట్టాలి

హాలహర్వి: మండలంలో నైపుణ్య గణన పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బందికి పంపే సమయంలో మ్యాపింగ్ అనేది తప్పనిసరి అని చెప్పారు. ఇంట్లోని ప్రతి సభ్యుడి విద్యార్హలతో పూర్తి వివరాలు సేకరించాల్సి ఉన్నందున అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా జరిగే నైపుణ్య గణనలో ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉండే ప్రాంతాలను ముందుగా ఎంచుకొని, వాటి పరిధిలో గణన చేపట్టాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. మండల సమన్వయకర్త నరసప్ప, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎల్లార్తి దర్గాల్లో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు

హొళగుంద: మండలంలోని ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డీ సాయిబాబా ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. తీర్థ, ప్రసాద పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ ఇందిర సూచించారు. మండలంలోని రత్నాపల్లె, యాదరాళ్ల ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో జరిగే ఎఫ్ఏ–2 పరీక్షలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతగా వండి వడ్డించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు.

క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి


మద్దికెరలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ఆస్పరి: 18ఏళ్ల నిండిన వారందరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్లు రఘురామిరెడ్డి, బాలకృష్ణారెడ్డి తెలిపారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ముందుస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షించుకోవాలని నినాదాలు చేస్తూ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు మాట్లాడుతూ ముందస్తుగా గుర్తించి చికిత్స పొందితే క్యాన్సర్‌ను నివారించడం సాధ్యమేనన్నారు. సిగరెట్, పొగాకు, గుట్కా, మత్తు పదార్థాలు ఆరోగ్యానికి చేటన్నారు. సూపర్ వైజర్ శ్రీనివాసులు, వైద్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దికెర : క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి మందులు వాడడం వల్ల పూర్తిస్థాయిలో నివారించేందుకు స్క్రీనింగ్ విధానం అందుబాటులోకి వచ్చిందని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా స్థానిక పభుత్వ వైద్యశాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యమని ముందస్తు పరీక్ష ద్వారా క్యాన్సర్ నుంచి కాపాడుకోవచ్చన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ హెల్త్ ప్రొవైడర్లు, హెల్త్ సెక్రటరీలు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ఆరోగ్య బృందాలుగా ఏర్పడి 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి బ్రెస్ట్ , సర్వైకల్, ఓరల్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలన్నారు. సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్‌ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, సిబ్బంది సూర్యనారాయణ, కృష్ణమ్మ పాల్గొన్నారు.

ఆలూరు: క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మొలగవెల్లి గ్రామ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవి ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకర జీవితం గడిపేందుకు ఆరోగ్య సూత్రాలను పాటించాలని చెప్పారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ,ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కృష్ణగిరి: మండలంలోని చిట్యాల గ్రామంలో రెండు రోజులుగా అభయ అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమాలు అక్షిత ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. గురువారం ప్రాంగణంలో హోమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం నెల్లూరు కళాకారులతో చెక్క భజన, కోలాటం ఉంటుందని ఆయన తెలిపారు.


హోమాలు నిర్వహిస్తున్న పండితులు

ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలి

కృష్ణగిరి: ఈ నెలలో జరిగే ప్రత్యేక శిబిరాల ద్వారా ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ చంద్రశేఖర్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 9, 10 తేదీలతో పాటు 23, 24 తేదీల్లో ఓటరు నమోదు క్యాంపులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఆయా గ్రామాల బీఎల్‌ఓలు ఆయా తేదీల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ఫారం–6ను స్వీకరించాలని సూచించారు. 2025 జనవరికి 18 ఏళ్లు పూర్తయ్యే యువతీ యువకులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆర్ఐ మనోహర్, అన్ని గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.


బీఎల్‌ఓలతో సమావేశమైన తహసీల్దార్ చంద్రశేఖర్

సమావేశ సంప్రదాయాలను పాటిస్తాం

ఆలూరు: వచ్చే మండల సర్వసభ్యసమావేశం నుంచి కేవలం ప్రజా ప్రతినిధులు, సంబంధి అధికారులు, సిబ్బందిని మాత్రమే అనుమతించి, సభా సంప్రదాయాలను పాటిస్తామని ఆలూరు ఎంపీపీ జెట్టప్పగారి రంగమ్మ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ..బుధవారం జరిగిన మండల మీట్ సమావేశ మందిరంలో అనధికారులే అధికంగా ఉన్నారని కొన్ని పత్రికల్లో ప్రచురితమైందన్నారు. ఎమ్మెల్యే విరూపాక్షి రావడంతో ఆయనకు సమస్యలను విన్నవించుకునేందుకు ప్రజలు, బాధితులంతా సమావేశ హాల్‌లోకి వచ్చారని చెప్పారు. దీంతోనే అనధికారుల సంఖ్య పెరిగిందన్నారు. వచ్చే సమావేశాల నుంచి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూసుకుంటామని తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బందికి సూచనలు చేశామని స్పష్టం చేశారు.

గుండెపోటుతో రైతు మృతి

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామానికి చెందిన రైతు కె.మరినాగప్ప (60) గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం ఉదయం పొలంలో పనిచేస్తుండగా ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలి పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు హాలహర్వి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతిచెందాడని డాక్టర్లు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్దదిక్కు మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.


కె.మరినాగప్ప (ఫైల్)

నీటి సమస్య పరిష్కారానికి కృషి

తుగ్గలి : గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ లీలావతి తెలిపారు. గురువారం పెండేకల్లు ఎస్సీ కాలనీలో పంచాయతీ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకులను ఆమె ప్రారంభించారు. ఇప్పటికే గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు అట్ల గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బసిరెడ్డి, సర్పంచ్ గౌరవ సలహాదారు మద్దిలేటి, ఎంపీటీసీ సభ్యుడు పెద్ద రంగన్న పాల్గొన్నారు.

ట్యాంకుల శుభ్రం

ఆస్పరి: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో గురువారం సర్పంచ్ మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో మంచి నీటి ట్యాంకులు, సంపును పంచాయతీ కార్మికులు శుభ్రం చేశారు. ట్యాంకులను శభ్రం చేసి క్లోరినేషన్ చేశారు. అలాగే డ్రైనేజీలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. గ్రామస్తులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో గురువారం బైకు ఢీకొనడంతో విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న లైన్‌మెన్ ఖాజా, ఆపరేటర్ రవికి గాయాలయ్యాయి. డ్యూటీ ముగించుకుని కార్యాలయానికి వెళ్తుండగా ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఇద్దరు బైకుపై వెళ్తూ ఆటోను ఓవర్‌టేక్ చేసి బాధితులు ప్రయాణిస్తున్న బైకును ఢీకొట్టారు. కింద పడడంతో వెంటనే స్థానికులు స్పందించి ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.